ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

5★ జిల్లా వార్తలు

శనివారం 5 ఏప్రిల్ 2025

నర్సరీల్లో మొక్కలను రక్షించాలి

ఓదెల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి పూర్తయ్యేవరకు మొక్కలు ఎండిపోకుండా నర్సరీల్లో రక్షణ చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ కాళిందిని దేవి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో గల నర్సరీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకంలో ప్రస్తుతం 80 శాతం వరకు పెరిగిందని, హరిత హారం వరకు మొక్కల సంరక్షణ చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపిఓ షబ్బీర్ పాష, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భద్రాచలం సీతారాముల కల్యాణానికి ప్రత్యేక బస్సు

మంథని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వెళ్ళే భక్తుల కోసం మంథని నుంచి భద్రాచలానికి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని డీఎం శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం అనంతరం భద్రాచలం నుంచి ఆదివారం సాయంత్రం 4 గంటలకు బస్సు మంథనికి బయలుదేరుతుందని తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన న్యాయవాది నూతి సురేష్‌కుమార్‌పై ఈ నెల 2న దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బార్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ పిలుపు మేరకు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. సురేష్‌పై అకారణంగా దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు జాగిరి రాజయ్య, పింగిలి విశేశ్వర్‌రావు, గంట నారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

పత్తి రైతులపై విత్తన భారం



- ఒక్కో ప్యాకెట్‌పై రూ.37 పెంపు
- ఐదేళ్లలో రూ.191 పెరిగిన ధర
- జిల్లా రైతులపై రూ. 75 నుంచి 85 లక్షల భారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పత్తి రైతులపై యేటా విత్తనాల భారం పడుతోంది. సరైన దిగుబడులు రాక, మద్దతు ధరలు దక్కక రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా ఈ ఏడాది కూడా ఒక పత్తి ప్యాకెట్‌పై విత్తన కంపెనీలు రూ.37 పెంచడంతో రైతులపై మరింత భారాన్ని మోపినట్లయ్యింది. జిల్లాలో గతేడాది 57,269 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. 3 ఎకరాలకు పైగా అంతర్గాం, మంథని, ఓదెల, పెద్ద పల్లి, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, పాలకుర్తి, జూలపల్లి మండలాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. పత్తి సాగుకు వ్యవసాయ శాఖ బీటీ-2 రకం 2 లక్షల నుంచి 2 లక్షల 20వేల పత్తి విత్తనాల (500 గ్రాములు) ప్యాకెట్లను రైతులకు అందుబాటులో ఉంచుతోంది. ఒక్కో రైతు ఎకరానికి 3 నుంచి 4 ప్యాకెట్ల విత్తనాలు వేస్తుం టారు. ఒకవేళ విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు పడ కుంటే మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 70 శాతానికి పైగా పత్తి పంటను వర్షాధార పంట కిందనే సాగు చేస్తుంటారు. వర్షాకాలం ఆరంభా నికి ముందే పత్తి కొయ్యలను తొలగించి వేసవి దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచుతారు. తొలకరి జల్లులు పడ గానే మరోసారి దుక్కి దున్ని అచ్చు కొట్టి విత్తనాలు వేస్తారు. విత్తన కంపెనీలు, కేంద్రం పెంచిన పత్తి విత్తనాల ధరల భారం జిల్లా రైతులపై 75 నుంచి 85 లక్షల రూపాయల వరకు పడుతున్నది.

● మద్దతు ధరలు దక్కక నష్టాలు..

అతివృష్టి, అనావృష్టిల కారణంగా పత్తి పంటకు తెగు ళ్లు సోకి ఆశించిన మేరకు దిగుబడులు రాక, మద్దతు ధరలు దక్కక పత్తి రైతులు యేటా నష్ట పోతున్నారు. కౌలు రైతులకు ఇంకా ఎక్కువ నష్టం వాటిల్లుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు మధ్య రకం పింజ గల పత్తికి క్వింటాల్‌కు రూ.7,171, పొడవు పింజ గల పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 నిర్ణయించారు. కానీ మార్కెట్లలో ఈ ఏడాది వ్యాపారులు అంత ధర చెల్లించ లేదు. సీసీఐ అంతంత మాత్రంగానే కొనుగోలు చేసింది. క్వింటాలుకు 7 వేల నుంచి 7,200 రూపాయలు మాత్రమే ధర పలికింది. దిగుబడి కూడా ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. యేటా విత్తనాలు, ఎరువులు, ఇతర పెట్టుబడులు పెరుగు తున్నా, అందుకు తగ్గట్లుగా లాభాలు రావడం లేదని రైతులు అంటున్నారు. యేటా విత్తనాల ధరలు పెంచు తూ తీరని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

● ఐదేళ్లలో ప్యాకెట్‌కు రూ.191 పెరిగిన ధర..

యేటా పత్తి విత్తనాల ధరలు పెంచుతున్న విత్తన కంపెనీలు గడిచిన ఐదేళ్లలో ఒక ప్యాకెట్ (500 గ్రాము లు) విత్తనాలపై 191 రూపాయలు పెంచాయి. ఐదేళ్ల క్రితం ప్యాకెట్ ధర 710 రూపాయలు ఉండగా, ప్రస్తు తం 901 రూపాయలకు పెరిగింది. గతేడాది 11 రూపా యలు పెరగగా, ఈ ఏడాది ఏకంగా రూ.37

(మిగతా 8వ పేజీలో)

ఎర్లీ బర్డ్ ఆఫర్‌కు స్పందన



కమిషనర్‌కు పన్ను చెల్లిస్తున్న వైద్యురాలు లక్ష్మీవాణి

కోల్‌సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద 5శాతం రాయితీకి స్పందన లభిస్తుందని రామగుండం కమిషనర్ అరుణశ్రీ తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని లక్ష్మీనగర్‌లోని ఐదు అసెస్‌మెంట్లకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎర్లీ బర్డ్ ఆఫర్‌లో ఆస్తి పన్ను చెల్లించారని, రూ.74,400 పన్ను చెల్లించాల్సి ఉండగా 5 శాతం రాయితీతో రూ.70295చెల్లించారని, మరో నిర్వాహకుడు రూ.97,850 చెల్లించాల్సి ఉండగా 5శాతం రాయితీతో రూ.92,957 చెల్లించినట్టు కమిషనర్ తెలిపారు. ఈ ఆఫర్‌ను మిగతా వారు కూడా ఉపయోగించుకుని రాయితీ పొందాలని కోరారు. పన్ను చెల్లించిన వారిని కమిషనర్ అభినందించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, రెవెన్యూ ఆఫీసర్ ఆంజేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, ఖాజా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు తప్పదు 8 ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం

రామగుండం వార్షిక బడ్జెట్ రూ.246.47 కోట్లు

- గతేడాది సవరించిన బడ్జెట్ రూ.97.62 కోట్లే...
- ఈ ఏడాది రూ.149కోట్లకు పెరిగిన బడ్జెట్
- అమృత్, టీయూఎఫ్ఐడీసీ, ఆర్థిక సంఘం నిధులపైనే ఆశలు...
- రూ.5కోట్లు పన్నుల ఆదాయం పెరుగుతుందని అంచనా...
- గ్రీన్ బడ్జెట్‌కు రూ.4.5కోట్లు
- ట్రేడ్ లైసెన్స్‌లు, స్టాంప్ డ్యూటీ ఆదాయాలపై తక్కువ అంచనాలు...

కోల్‌సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.246.47కోట్ల వార్షిక బడ్జె ట్ రూపొందించుకుంది. కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ శ్రీహర్ష బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. గతేడాది సవరించిన బడ్జెట్ రూ.97.62కోట్ల నుంచి ఈసారి అంచనా బడ్జెట్ రూ.246.47కోట్లకు పెరిగింది. 2024-25 ఆర్థిక సంత్సరంలో రూ.10కోట్ల మిగులుతో రూ.192.42కోట్ల బడ్జెట్ అంచనా వేశారు. కానీ అనుకున్న మేర పన్నులు, ఇతర గ్రాంట్లు రాకపోవడంతో బడ్జెట్‌ను సవ రించి రూ.97.62కోట్లకు కుదించారు. ఈసారి అమృత్, టీయూఎఫ్ఐడీసీ, 15వ ఆర్థిక సంఘం, పరిశ్రమల సీఎస్ఆర్‌లు అంచనా వేసుకుని బడ్జెట్‌ను రూ.246.47కోట్లకు పెంచారు.

రామగుండం నగరపాలక సంస్థ 2024-25 ఆర్థిక



సంవత్సరంలో రూ.10.46కోట్ల మిగులుతో రూ.196.42కోట్ల వార్షిక బడ్జెట్‌ను రూపొందించు కుంది. ఈ బడ్జెట్‌లో సాధారణ నిధులు, ప్రభుత్వ గ్రాంట్లపై భారీ అంచనాలు పెట్టుకుని రూపొందించింది. ముఖ్యంగా డీఎంఎఫ్‌టీ నుంచి రూ.15కోట్లు వస్తాయని అంచనా వేస్తే రూ.22లక్షల నిధులు వచ్చాయి. ఇక టీయూఎఫ్ఐడీసీకి సంబంధించి గతేడాది గ్రాంట్ విడుదల కాలేదు. రూ.10కోట్లు పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు అంచనా వేయగా రూ.1.16కోట్లు మాత్రమే మాత్రమే వచ్చాయి. ఇక అమృత్ రూ.50కోట్ల అంచనా వేస్తే నిధులు విడుదల కాలేదు. అమృత్, టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులు అంచనాల ప్రకారం రాలేదు. కేవలం స్టాంప్ డ్యూటీ రాదని ఆశలు వదలుకొని గతేడాది బడ్జెట్‌లో ఆదాయంగా పెట్టుకోలేదు. కానీ రూ.16.5కోట్లు విడుదల అయ్యాయి. గత ఏడాది సాధారణ నిధుల అంచనాల్లోనూ లెక్కలు తప్పాయి. ముఖ్యంగా పన్నుల వసూళ్లకు సంబంధించి సాధారణ పన్నుల వసూళ్ల, ప్రభుత్వ ఆస్తులపై పన్నులు, షాపుల అద్దెల, భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అంచనాలు తప్పాయి. ఒక్క ఎల్ఆర్ఎస్ ఆదాయం మాత్రం సవరించిన బడ్జెట్‌లో రూ.2కోట్ల అంచనా వేస్తే రూ.5కోట్ల ఆదాయం వచ్చింది. ఆదాయ మార్గాలు ఆశించిన మేర లేకపోవడంతో సవరించిన బడ్జెట్‌ను రూ.97.62కోట్లకు కుదిరించారు.

● 2025-26లో రూ.246.47కోట్లతో బడ్జెట్

2025-26 ఆర్థిక సంవత్సరంలో రామగుండం నగరపాలక సంస్థ రూ.246.47కోట్లతో వార్షిక బడ్జెట్‌ను రూపొందించింది. ఇందులో సాధారణ పన్నుల ఆదాయాన్ని రూ.5 కోట్ల మేర పెంచుతూ అంచనా వేసింది. గతేడాది సవరించిన బడ్జెట్ రూ.8.26కోట్లు ఉంటే ఈసారి రూ.12కోట్లకు అంచనా వేశారు. ప్రభుత్వ ఆస్తులపై పన్నులు, కేంద్రప్రభుత్వ ఆస్తులపై పన్నులను రూ.1కోటి మేర పెంచి అంచనా వేశారు. స్టాంప్ డ్యూటీ నిధులు గతంలో రూ.16.05కోట్లు విడుదల కాగా ఈసారి రూ.2.5కోట్లు అంచనా వేశారు. షాపింగ్ కాంప్లెక్స్, కిరాయిలు, ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి రూ.50లక్షలు, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రూ.8కోట్లు, ఎల్ఆర్ఎస్ రూ.2.5కోట్లుగా అంచనా వేశారు. మొత్తంగా పన్నులు, ఇతర నాన్ ట్యాక్సెస్ ఆదాయాన్ని ఈ ఏడాది రూ.40.5కోట్లుగా చూపారు. గతేడాది సవరించిన బడ్జెట్‌లో రూ.46.92కోట్లు ఉంటే ఈ సారి రూ.40.5కోట్లుగా అంచనా వేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి గ్రాంట్లపైనే ఎక్కువగా అంచనా పెట్టుకున్నారు. అమృత్ రూ.88కోట్లు, 15వ ఆర్థిక సంఘంకు సంబంధించి రూ.10కోట్లు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ రూ.2 కోట్లు, పరిశ్రమల సీఎస్ఆర్ రూ.5కోట్లు, టీయూఎఫ్ఐడీసీ రూ.80కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.10కోట్లు, డీఎంఎఫ్‌టీ రూ.3కోట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ముఖ్యమంత్రి మున్సిపల్‌కు రూ.10కోట్ల నిధులు విడుదల చేయగా ఈ సారి దానిపై ఎలాంటి ఆశలు పెట్టుకోలేదు.

● రూ.236కోట్ల వ్యయం అంచనా...

రూ.246కోట్ల ఆదాయాన్ని అంచనా వేసుకుంటున్న కార్పొరేషన్ రూ.236 కోట్ల వ్యయంతో రూ.10.46కోట్లు మిగులు బడ్జెట్ ఉంటుందని లెక్కలు గడుతోంది. వ్యయం విషయంలో కార్మికుల వేతనాలకు సంబంధించి రూ.1.5కోట్లు అంచనాలు పెంచారు. అదే సమయంలో పారిశుధ్య కార్మికుల సౌకర్యాల బడ్జెట్‌ను రూ.25 నుంచి రూ.15లక్షలకు, పారిశుధ్యం బ్లీచింగ్, ఇతర కొనుగోళ్లపై కూడా రూ.5లక్షల కోత పెట్టారు. వాహనాల ఇంధనానికి సంబంధించి రూ.2.5కోట్లు, కుక్కలు, కోతులు, పందుల నియంత్రణకు రూ.10లక్షలు, పండుగల నిర్వహణకు రూ.50లక్షలు, వీధి దీపాల చార్జీలకు రూ.1.7కోట్లు, ఈఈఎస్ఎల్ బకాయిల చెల్లింపులకు రూ.2కోట్లు పెట్టారు. ఈ ఏడాది ఎన్నికలు జరుగుతాయని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిర్వ హణకు రూ.1కోటి బడ్జెట్‌లో కేటాయించారు. గ్రీన్ బడ్జెట్‌ను రూ.4.55 కోట్లుగా నిర్ణయించారు. వీధి దీపాల విడిభాగాల కొనుగోలుకు రూ.40లక్షలు కేటాయించారు.

ఏటీసీ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి



ఏటీసీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీసీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఏటీసీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 6ట్రేడ్‌లతో యువతకు ఉపాధి శిక్షణ అందించేందుకు నిర్మిస్తున్న ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) భవన నిర్మాణం, పరికరాలు అమర్చే పనులను వేగవంతం చేయాలన్నారు. ఐటీఐ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 14వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయంలో అందించాలని, ఈ కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ యువకులకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా 100 శాతం సబ్సిడీపై రూ.50వేల యూనిట్, 90 శాతం సబ్సిడీపై లక్ష రూపాయల యూనిట్, 80 శాతం సబ్సిడీతో 2 లక్షల యూనిట్, 70 శాతం సబ్సి డీతో 4 లక్షల వరకు యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం అందిస్తుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయ పరిమితి 1,50,000 రూపాయలలోపు, పట్టణ ప్రాంతాలలో రెండు లక్షల లోపు ఉండాలని, తెల్లరేషన్ కార్డులో దరఖాస్తుదారుని పేరు లేకుంటే ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, రవాణా రంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాస్ పుస్తకం, దివ్యాంగులు సైతం సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో దరఖాస్తు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక అనంతరం శిక్షణ అందిస్తామని, ఆసక్తిగల యువకులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కోయశ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బపల్లి శివారులో సర్వే నెం. 173లో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 3న భానుచందర్ అనే వ్యక్తి ప్రకృతి వనంలో ఉన్న 4 ఎకరాల స్థలంలో చెట్లను కొట్టివేసి భూమిని చదును చేసి పొలం గట్లు వేశాడన్నారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు భానుచందర్ పై కేసు నమోదు చేశారన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పేదవారు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

● సన్న బియ్యం పంపిణీలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



మంథనిలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదవారు సంతోషంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన అందరికి మేలు చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శివకిరణ్ గార్డెన్స్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను సరి చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిల కృషి మేరకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. పేదవారు కూడా సన్న బియ్యం తినాలనే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ముందుకు నడుస్తున్నామన్నారు. ఈపథకం అమలుతో రాష్ట్రానికి 3నుంచి 4 వేల కోట్ల అదనంగా ఆర్థికం భారం పడుతున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. పేదవారికి సన్న బియ్యం అందించాలే ఆలోచన చేసి సన్నరకం వడ్లకు రూ. 5 వందల బోనస్ ఇచ్చామన్నారు. కాళేశ్వరం లేకున్న రికార్డు స్థాయిలో ధాన్యం పెరిగిందన్నారు. బోనస్ రూపంలో రూ.2 వేల కోట్లు రైతులకు ఇచ్చామన్నారు. రేషన్‌డీలర్ల సమస్యలపై సానుకులంగా ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. 15 రోజుల్లో నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసంలో నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఆర్డీవో సురేష్, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్, పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, శశిభూషన్‌కాచే, ప్రసాద్, భాస్కర్‌రావు, చొప్పరి సదానందం, సురేష్, పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఇద్దరు యువకుల దుర్మరణం

6



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ఎన్‌టీపీసీలో రోడ్డు ప్రమాదం

- ఒకరి మృతి...
- మరొకరికి తీవ్రగాయాలు

6

వివాహితను బలి తీసుకున్న సోషల్ మీడియా

- వ్యక్తిగత వీడియోను పోస్టు చేసిన యువకుడు
- అవమానంతో ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిగత వీడియో వైరల్ అయిందనే మనస్థాపంతో జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(23) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలి ఇంటి సమీపంలో ఉండే హుస్సేన్ అనే వ్యక్తి ఆమె వ్యక్తిగత వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో మనస్థాపం చెందిన వివాహిత ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం ఉదయం కూతురు చూసి పక్కింటి వాళ్లకు తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు. తన మృతికి హుస్సేన్ అనే వ్యక్తి కారణమంటూ ఆత్మహత్యకు ముందు హిందీలో సూసైడ్‌నోట్ రాసింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతురాలి భర్త రెండు సంవత్సరాలక్రితం ఉపాధికోసం దుబాయివెళ్లాడు. మృతురాలికి కొడుకు(4), కూతురు(2) ఉన్నారు.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌లో చింతకుంట దుర్గాప్రసాద్(22) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... దుర్గాప్రసాద్ ఇంట్లో అందరు నిద్రిస్తుండగా తెల్లవారు జామున ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న దుర్గాప్రసాద్ పోలీస్ కానిస్టేబుల్, తదితర పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ ఏ ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి చింతకుంట శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామానికి చెందిన పాతూరి మల్లవ్వ(54) అనే మహిళ శుక్రవారం అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడింది. మల్లవ్వ గర్భకోశ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతోంది. గతంలో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో మల్లవ్వకు ఆపరేషన్ కూడా అయ్యింది. అయినా వ్యాధినయం కాలేదు. తన అనారోగ్య సమస్యను తలచుకుంటూ మల్లవ్వ బాధపడేది. శుక్రవారం తన భర్తతో కలిసి మల్లవ్వ పొలం వద్దకు వెళ్లింది. భర్త రాంరెడ్డి పాడి గేదలకు మేత వేసేందుకు వెళ్లగా మల్లవ్వ అక్కడే ఉన్నచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతురాలు భర్త రాంరెడ్డి ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓగుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి వయస్సు 20-25 మధ్యలో ఉంటుందని, ఆంధ్రకు చెందిన దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

ముస్తాబాద్(గంభీరావుపేట), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓవృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరింది. కట్కూరి బాలవ్వ అనే వృద్ధురాలు తన ఇంటి వద్ద ఉండగా, కోతులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ బాలవ్వను బంధువులు ఓ ప్రైవేటుఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు.

సిరిసిల్ల నేతన్నల ప్రతిభ



నేసిన బంగారు చీరతో నల్ల విజయ్

సిరిసిల్ల ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కళాకారులు యెల్ది హరిప్రసాద్, నల్ల విజయ్‌లు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మరమగ్గాలపై తమ కళా నైపుణ్యంతో అద్భుతంగా చీరలను తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 6న జరిగే భద్రాద్రి సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీరను హరిప్రసాద్ సిద్ధం నేశారు. అలాగే నల్ల విజయ్ పువ్వుల డిజైన్‌తో కూడిన బంగారు చీరను నేశారు. ఈ ఇద్దరి కళాకారుల ప్రతిభను చూసి పలువురు అభినందిస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి బంగారు పట్టుచీర..

సీతారాముల కల్యాణం జనులందరూ ఎంతో సంబురంగా జరుపుకుంటారు. అందులో ముఖ్యంగా భద్రాదిలో జరిగే వేడుకలకు తరలివెళ్తారు. ఆ రాముడికి మరోసారి సిరిసిల్ల నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్ మరో అద్భుతమైన బంగారు వర్ణంతో పట్టు చీరను సిద్ధం చేశాడు. ఈనెల 6న భద్రాది దేవాలయంలో జరిగే సీతారాముల కల్యాణపు వేడుకలకు అందించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విభిన్నమైన చీరలను తయారుచేస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హరిప్రసాద్ 5.50 మీటర్లు 800 గ్రాముల బరువు గల చీరలో వన్ గ్రామ్ గోల్డ్ జరీని ఉపయోగించి చేనేత మగ్గంపై చీరను నేశారు. చీరపై సీతారాములు, లక్ష్మణుడు, ప్రతి రూపా లను నేశాడు. ఆరు రోజుల పాటు శ్రమించి తయారు చేసిన ఈ చీర కొంగుపై భద్రాది ఆలయ మూలవిరాట్ దేవతామూర్తులను నేశారు. చీర బోర్డర్‌లో శంఖు, చక్రనామాలు, హనుమంతుడు, గరుత్మంతుల ప్రతిరూపాలు నేశా డు. చీరలో శ్రీరామ, శ్రీరామ రామేతి రమే రామే మనోరమే, సహస్ర నామతాత్యుల్యం అనే శ్లోకాన్ని వచ్చే విధంగా 51సార్లు పొందు పర్చారు. అద్భుతంగా తయారైన చీరను కల్యాణం సందర్భంగా అందించనున్నారు. రెండు సంవత్సరాలుగా సీతారామ కల్యాణం సందర్భంగా చీరలను నేసి అందిస్తున్నారు.





చేనేత మగ్గంపై చీరను నేస్తున్న నేత కళాకారుడు హరిప్రసాద్, చీరపై సీతారాముల ప్రతిరూపం

ఆకర్షణీయంగా బంగారు చీర..

సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ చేనేత మగ్గంపై అబ్బురపరిచే చీరలను నేస్తున్నాడు. తాజాగా పువ్వుల డిజైన్‌తో బంగారాన్ని ఉపయోగించి ఆకర్షణీయంగా చేనేత మగ్గంపై చీరను నేశాడు. బళ్లారికి చెందిన ఓ వ్యాపారవేత్త తన కుమార్తె కోసం 20 గ్రాముల బంగారాన్ని ఉపయోగించి చీరను నేయాలని విజయ్‌కు ఆర్డర్ ఇచ్చాడు. చీరపై బంగారు వర్ణంతో పువ్వులు పూసినట్లుగా నేశాడు. 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో 800 గ్రాములు ఉన్న ఈ చీరను పది రోజులు శ్రమించి నేశాడు. గతంలో 200 గ్రాములు బంగారంతో చీరను నేశాడు. వెండి ని ఉపయోగించి రంగులు మార్చే చీరను, 222 రంగులతో పరిమళించే పట్టు చీరను తయారు చేశాడు.

హోటళ్లపై సివిల్ సప్లయిస్ అధికారుల దాడులు

- 102 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్‌సప్లై అధికారి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సివిల్ సప్లై అధికారులు శుక్రవారం నగరంలోని పలు టిఫిన్‌సెంటర్లు, హోస్టళ్లలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 102 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ గృహవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్‌సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వినియోగించడం నేరమన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈదాడుల్లో అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బుచ్చిబాబు, డీటీసీఎస్ ఖాజా మోయినోద్దీన్, వసంత్‌రావు, సురేందర్, ఉష, ఎఫ్ఐఎస్ అన్వర్, వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను శిక్షించాలి

ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసిన సాయికుమార్‌ని దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నిజనిర్ధారణ బృందం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్‌గౌడ్ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. వారు మాట్లాడుతూ సాయికుమార్ అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయి రెండేళ్లుగా ప్రేమించుకున్నారన్నారు. వీరి ప్రేమను సహించని అమ్మాయి తండ్రి సదయ్య మార్చి 27న సాయికుమార్‌ను హత్యచేశాడని పేర్కొన్నారు. కుల అసమానతల నిర్మూలన పోరాటసమితి, సావిత్రిబాయిపూలే మహిళాసంఘం వారు హత్యను ఖండించారు. హత్యకు ప్రధాన సూత్రధారులైన సిద్ధి సారయ్య, చీకటి హరీష్‌గౌడ్, చీకటి మల్లయ్యగౌడ్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ బృందం రాష్ట్రప్రధాన కార్యదర్శి కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జె.చక్రవర్తి, రాష్ట్ర సావిత్రిబాయిపూలే మహిళ సంఘం అధ్యక్షురాలు గన్నారపు సరోజన, చైతన్య భారతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవిందు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర మోహనక్రిష్ణ, రాష్ట్ర నాయకుడు ఆరేపల్లి క్రాంతికిరణ్, రాష్ట్ర కన్వీనర్ తెలంగాణ సామాజిక ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సభ్యుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎర్రవెల్లి రమేష్, రాములు

కోనరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికిచెందిన ఇద్దరు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఇద్దరు నీరటి రామయ్య, ఎర్రవెల్లి రమేష్‌లు గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్ళింది. బాధితులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు ● అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం



గౌస్, ఇమ్రాన్(ఫైల్)



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రామగుండం కేజీఎన్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో నివాసం ఉండే మహ్మద్ గౌస్ అలియాస్ నిస్సార్(34) అనేయువకుడు ఎన్టీపీసీలోని ఒక జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అతడి స్నేహితుడు మహబూబ్ బస్తీకిచెందిన షేక్ఇమ్రాన్ (28) తోకలసి కారులో హైదరాబాద్‌వెళ్ళారు. అనంతరం హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి రామగుండానికి తిరుగు ప్రయాణంఅయ్యారు. కారును మహ్మద్‌గౌస్ నడుపుతున్నాడు. సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో చేరుకునే సరికి శుక్రవారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుకనుంచి వేగంగా ఢీకొన్నారు. కారులో ఉన్న ఇద్దరిలో ఇమ్రాన్ అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాలైన గౌస్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మరోగంటలో రామగుండం చేరుతారనగా ప్రమాదం జరగడం, ఇద్దరు చనిపోవడం వారి వారి కుటుంబాల్లో తీవ్రవిషాదం నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో మహ్మద్ గౌస్‌కు నాలుగేళ్ల క్రితమే వివాహం కాగా భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇమ్రాన్ అవివాహితుడు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన చింతల శివరాజు ట్రాలీ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీచేయగా సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లచెరువు గ్రామం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకు న్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం పొత్తూరు గ్రామసమీపంలోని బిక్కవోలు నుంచి పెద్దలింగాపూర్ గ్రామానికి ఇసుక తరలిస్తామని రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని సమా చారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న కరీం నగర్ జిల్లా ఖాజీపూర్ గ్రామానికి చెందిన అనుగొండ మధుపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సిలిండర్ పేలి ఇంటి పై కప్పు ధ్వంసం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్న పేట గ్రామానికిచెందిన బాలసాని నిర్మల-సమ్మయ్య ఇంట్లో శుక్రవారం సిలిండర్ పేలి ఇంటి పైకప్పు ధ్వంసమైంది. బాధితుల కథనం మేరకు ఇంట్లో వినియోగిస్తున్న సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఇంటి రేకులు ధ్వంసం అయ్యాయి. సిలిండర్ ప్రమాదంలో ఇంటి పైకప్పు రేకులు పగలడంతో పాటు, విద్యుత్ మీటర్, వంట సామగ్రి దెబ్బతినడంతో ఆర్థికంగా నష్టపోయామన్నారు. గ్యాస్ సంస్థ ఆదుకోవాలని బాధితులు కోరారు. సంఘటన స్థలానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

'ఉపాధి' పనులపై కూలీల ఆసక్తి



రామడుగులో పనులు చేస్తున్న కూలీలు

రామడుగు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా కూలీలు పనులు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రతిరోజు మండలంలో వివిధ గ్రామాల్లో 1200మంది వరకు ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచినరేట్లతో రోజుకు ఒక్కోకూలీకి 300రూపాయల వరకు చెల్లిస్తోంది. ఇందిరమ్మ ఆత్మీయభరోసా కార్యక్రమంలో భాగంగా భూమి లేని నిరుపేదలకు 12 వేల రూపాయలు అందిస్తుండడంతో కూలీలు తమకు కేటాయించిన పనిదినాలను చేపట్టడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సంవత్సరానికి కనీసం 20 రోజులు పని చేసిన వారికి ఆత్మీయ భరోసా పథకం వరిస్తుంది. ఈ నేపథ్యంలో పనుల్లో పాల్గొనేందుకు పలువురు ముందుకువస్తున్నారు. మండలంలోని గుండి, గోపాల్‌రావుపేట, రామడుగు, వెదిర, కోరటపల్లి, దత్తోజీపేట, వెలిచాలతోపాటు అన్ని గ్రామాల్లో నీటికుంటలు, ఫార్మేషన్ రోడ్స్, డైవర్షన్ డ్రైన్స్, ఎస్సీ, ఎస్టీ స్మాల్, మార్జినల్ ఫార్మర్స్ ల్యాండ్ డెవలప్‌మెంట్ వర్క్స్ చేపడుతున్నారు. మండలంలో 8,582 జాబ్‌కార్డులు ఉండగా 3,506 మంది పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 1,97,500 పనిదినాలు కల్పించినట్లు ఏపీవో రాధ తెలిపారు.

అజాగ్రత్తగా వాహనం నడిపిన వ్యక్తికి ఏడాది జైలు

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి 12 గొర్రెల మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా, బాధితుడికి లక్షరూపాయల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపుజ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కసాదిచంద్రయ్య అనేవ్యక్తి గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. 2017 ఫిబ్రవరి 14న తన గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సంతోష్ అనేవ్యక్తి వాహనాన్ని అతివేగంగా నడుపుతూ గొర్రెల మందను ఢీ కొట్టాడు. దీంతో సంఘటన స్థలంలో 12 గొర్రెలు మృతి చెందగా మరికొన్ని గాయపడ్డాయి, బాధితుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రణధీర్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి సురేష్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సంతోష్‌కు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ఎక్కువ నీడనిచ్చే మొక్కలను పెంచాలి

- రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా



మహాత్మానగర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా

తిమ్మాపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ నీడను ఇచ్చే మొక్కల రకాలను, పండ్లమొక్కలను ఎక్కువగా పెంచాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ కమిషనర్ బి షఫీయుల్లా అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన దశబ్ధి సంపదవనాలు ప్లాంటేషన్‌ను సందర్శించారు. అందులో పెంచుతున్న మొక్కలు, పండ్లమొక్కలరకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీకి అదనపు ఆదాయాన్ని ఇచ్చే మొక్కలను పెంచినందుకు క్షేత్రస్థాయి సిబ్బందినిఆయన అభినందించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించి నర్సరీలో పెంచుతున్న మొక్కలపై అడిగి తెలుసుకున్నారు. సంపద వనంలో ఓ మొక్కను నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో స్టేట్ ప్లాంటేషన్ మేనేజర్ నర్సింగరావు, డీఆర్డీవో వి శ్రీధర్, ఏపీడీ పి క్రిష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి..
- మరొకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సమీప రాజీవ్ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దీకొండ అభిరామ్(18) అనే యువకుడు మృతిచెందాడు. పెద్దూరి అభిరామ్(17) అనే మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాలలో ఒక మాల్‌లో సెల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్న దీకొండ అభిరాం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం కరీంనగర్‌లో వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్టీపీసీ బి.పావరాజు గడ్డ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన దీకొండ అభిరామ్ అక్కడిక్కడే మృతిచెందగా పెద్దూరి అభిరామ్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి మేనమామ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్ఐ మానస తెలిపారు.

గంభీరావుపేటలో తాగునీటి కటకట

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గంభీరావుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఆ కాలనీవాసులు శుక్రవారం నిరసన చేపట్టారు. మహిళలు ఖాళీ బిందెలను ప్రధాన రహదారిపై పెట్టి తాగునీటి ఎద్దడి తీవ్రతను తెలిపారు. ఉన్న బోరులో నీరు తగ్గడంతో సరిపడా నీరు రావడం లేదని, మిషన్ భగీరథ పైపులైన్ వేసి సంవత్సరాలు గడుస్తున్నా నీరు రావడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని, మురికి కాలువలు కూడా సరిగ్గా తీయక దోమలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలపడంతో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేశారు.

పింఛను డబ్బులు కాజేశాడనే ఆవేదనతో వృద్ధుడి మృతి



లక్ష్మణ్(ఫైల్)

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు కాజేశాడనే ఆవేదనతో జగిత్యాల జిల్లాకేంద్రంలోని గాంధీ నగర్‌కు చెందిన నక్క లక్ష్మణ్(66) అనే వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. నక్క లక్ష్మణ్ ఎస్సారెస్పీలో అటెండర్‌గా విధులు నిర్వహించి 2011లో పదవీ విరమణ పొందాడు. అప్పటి నుంచి 2018 సంవత్సరం వరకు ప్రతి నెల వస్తున్న రూ.20వేల పింఛన్‌తో మతిస్థిమితం లేని ఇద్దరు కూతుళ్లతో పాటు భార్యను పోషిస్తున్నాడు. లక్ష్మణ్ ప్రతినెల పింఛన్ డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు ఇంటిపక్కనే ఉన్న తిరుపతి అనే యువకుడు సహాయ పడుతుండేవాడు. లక్ష్మణ్‌కు సంబంధించిన ఖాతాకు సైతం తిరుపతి తన ఫోన్ నంబరును లింకు చేయించుకున్నాడు. అయితే 2018 తర్వాత పింఛన్ రూ.46వేలకు పెరడగంతో దీన్ని ఆసరాగా చేసుకున్న యువకుడు ఎప్పటిలాగే వృద్ధుడికి రూ.20వేలు ఇస్తూ మిగిలిన డబ్బును తన సొంతానికి వాడుకున్నాడు. ఇలా మొత్తం రూ.18లక్షలను సొంతానికి వాడుకున్నాడు. అయితే పింఛన్ పెరిగిందని తెలుసుకున్న బాధితుడు తన బంధువుల సహాయంతో బ్యాంకుకు వెళ్లగా ఏడు సంవత్సరాల నుంచి రూ.46వేలు వస్తున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర పెట్టుకోవడంతో పోలీసులు మోసం చేసిన యువకుడిపై ఛీటింగ్ కేసు నమోదు చేశారు. రూ.18లక్షలు మోసపోయానని వృద్ధుడు నెల రోజులుగా తీవ్రమనోవేదనకు గురై శుక్రవారం మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ శివారు ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతుడి వయస్సు 40-45 మధ్య ఉంటుందని, పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో మృతదేహం ఉందని, జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు ఎస్ఐ నెంబర్ 8712656509 కు సంప్రదించాలని తెలిపారు.

బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ

పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు




రామోజీపేటలో మాట్లాడుతున్న వీహెచ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయే అని మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు హన్మంతరావు పేర్కొన్నారు. మండలంలోని రామోజీపేట గ్రామంలోని శ్రీసీతారామాశ్రమంలో శుక్రవారం వీహెచ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేపట్టారని, కాంగ్రెస్ పార్టీ అంటేనే నిరుపేదల పార్టీ అని అన్నారు. అనేక సంవత్సరాలుగా వెనకబడిన ప్రజలను గుర్తించి, సరైన అవకాశాలు కల్పించాలని రాష్ట్రంలో కులగణన చేపట్టామన్నారు. కులగణన ద్వారానే ఎంతశాతం జనాభా వెనుకబడిన వర్గాల ప్రజలు ఉన్నారో తెలిసిపోయిందన్నారు.

దీనిని కూడా కొంతమంది విమర్శలు చేసి ప్రజల్లో చులకన అయ్యారన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అవసరమైతే అన్ని రాష్ట్రాలలో తాను తిరిగి ఏకం చేస్తానన్నారు. బీజేపీ అధికారం కోసమే మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రామోజీపేట ఆలయానికి అనేక సంవత్సరాల నుంచి వస్తుంటానని తెలిపారు. శ్రీరాముడి ఆలోచన విధానం ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. సమావేశంలో పీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, పీసీసీ నాయకుడు గంప గంప మహేందర్, సిరిసిల్ల పద్మశాలి సంఘ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఏఎమ్‌సీ డైరెక్టర్ కేతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది తర్వాత ప్రత్యేక కోర్సులు

ఇంటర్‌తోపాటు వొకేషనల్, డిప్లొమా కోర్సులు



చొప్పదండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. తర్వాత ఏ కోర్సులు చేయాలనేది విద్యార్థులకు సంశయం ఏర్పడుతుంది. ఇంటర్మీడియట్ వైపు అందరిచూపు ఉంటుంది. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులను విద్యార్థులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇంటర్‌తోపాటు పాలిటెక్నిక్, ఐటీఐ, డిప్లమా, వొకేషనల్ లాంటి అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివిధ కోర్సుల వివరాల విద్యార్థుల కోసం.

• ఇంటర్..

ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, గురుకులాల్లో ఉన్నాయి.

• ఐటీఐ..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఫిట్టర్, మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, వైర్‌మెన్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫుడ్ ప్రొడక్షన్, వెల్డర్, తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పారామెడికల్..

డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లొమా ఇన్ హాస్పిటల్ ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఏఎన్‌ఎం కోర్సులు ఉన్నాయి.

• ఇంజనీరింగ్..

ట్రిపుల్ ఐటీ, ఐఎంఈ, ఐఈటీ ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

• పాలిటెక్నిక్...

కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్, అగ్రికల్చర్, టెక్నికల్ కెమికల్, సిరమిక్ టెక్నాలజీ, హార్టికల్చర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఐటీ, తదితర పాలిటెక్నిక్ కోర్సులు ఉన్నాయి.

• ఎన్‌టీటీఐ..

నేషనల్ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ఇన్ టూల్ అండ్ డై మేకింగ్, టెక్నికల్ స్కిల్స్, ఎలక్ట్రానిక్స్, మెకట్రానిక్స్, ఫ్యాషన్ డిజైనింగ్, ప్లాంట్ ఇంజనీరింగ్, మానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ.

• డిప్లొమా కోర్సులు...

హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజం, అకౌంటెన్సీ, ఇండస్ట్రీస్, పర్సనల్ మేనేజ్‌మెంట్, లెదర్ టెక్నాలజీ, మ్యూజిక్, డ్యాన్స్.

• వొకేషనల్ కోర్సులు..

29 రకాల వృత్తి విద్యా కోర్సులను ఇంటర్ బోర్డు నిర్వహి స్తున్నది. కొన్ని కోర్సులను పూర్తి చేసిన తర్వాత ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సెట్ రాసుకోవచ్చు. డిగ్రీ కోర్సుల్లో కూడా చేరవచ్చు.

• సర్టిఫికెట్ కోర్సులు..

డీటీపీ, టాలీ, గ్రాఫిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఈ కోర్సులలో కొన్నింటికి ప్రవేశపరీక్ష ద్వారా కళాశాలల్లో చేరే అవకాశం ఉండగా, మిగతా కోర్సులు చదివేందుకు విద్యార్థులకు మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి

ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మార్గా లతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించు కొని అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మార్కెటింగ్ మిషన్ సీఈవో షఫి ఉల్లా గ్రామీణ యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని బ్యాంకు కాలనీలో గల వోల్కసి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా ఇస్తున్న ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన కార్యక్ర మాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన గ్రామీణ యువతీయువకులకు ఇస్తారని, దీన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వోల్కసి టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మోతిలాల్ భార్గవ్, సెంటర్ మేనేజర్ మమత, ఈజీఎంఎం ప్రత్యేక అధికారి నర్సింహారెడ్డి, రవీందర్, శిక్షకులు అనిల్, రాములు, గాజు శ్రీనివాస్, మధుకర్, జ్యోతి, స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలూ.. రారండి..

• చిన్నారుల కోసం ప్రత్యేక గ్రంథాలయం • వేసవిలో అందుబాటులో పిల్లల పుస్తకాలు



కరీంనగర్ గ్రంథాలయంలో బాలల గ్రంథాలయ విభాగం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 4: వేసవి సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు, ఆటలకే పరిమితం కాకుండా వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక బాలల గంథాలయం ఏర్పాటు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన బాలల గ్రంథాలయంలో పిలల్లకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఇందులో 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడే కథలు, నాటికలు, బొమ్మలు, డ్రాయింగ్, పెయింటింగ్స్, పిల్లల వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయి. పుస్తకాలతో పాటు ఆటలకు కూడా బాలల గ్రంథాలయం నిలయంగా మారింది. చెస్, క్యారం, లూడో, చైనీ చక్కర్ వంటి ఆటలు ఆడుకోవచ్చు. వీటికి ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఒక వేళ నచ్చిన పుస్తకం ఇంటికి తీసుకొని వెళ్లి తిరిగి గ్రంథాలయంలో ఇవ్వాలనుకుంటే ఒక ఫొటో, ఆధార్‌కార్డ్, సంబంధిత స్వల్ప రుసుము చెల్లించి రెండు వారాల్లో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. వేసవిలో వార్షిక పరీక్షల అనంతరం ప్రతి రోజూ ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలల గ్రంథాలయం సేవలందించనుంది. ప్రతి శుక్రవారంతో పాటు ప్రభుత్వ సెలవు దినాల్లో బాలల గ్రంథాలయం అందుబాటులో ఉండదు. 8 నుంచి 10వ తరగతి ఆపై స్థాయి పిల్లలు కేంద్ర గ్రంథాలయంలో చదువుకోవచ్చు.

పిల్లల కోసం మరిన్ని పుస్తకాలు తెప్పిస్తాం

సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చిన్నారుల అభిరుచిని బట్టి మరిన్ని విజ్ఞాన, వికాస, చరిత్రాత్మక, కథలు, బొమ్మల పుస్తకాలు తీసుకరావడానికి గ్రంథాలయ సంస్థ సిద్ధంగా ఉంది. బాలల గ్రంథాలయానికి ప్రత్యేక విభాగం ఉంది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవకాశం ఉంది. దీన్ని సద్వినియోగం చేసుకొని భావి భరత పౌరు లుగా ఎదగాలని మా ఆకాంక్ష. విద్యార్థులకు గ్రంథాలయం ఆహ్వానం పలుకుతోంది.



బాలల గ్రంథాలయంలో ఆడుకుంటున్న చిన్నారులు (ఫైల్)

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కొనసాగుతున్న శ్రీరామనవమి వేడుకలు
- రాజన్నను దర్శించుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు
- రాజన్న సేవలో శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చి ఆలయ వసతిగృహాల్లో విడిది చేశారు. ఉదయం ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని స్వామి వారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని గండా దీపంలో నూనె పోసి గండాలు తొలగి పోవాలని వేడుకున్నారు.

కొనసాగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీసమేత అనంత పద్మనాభ స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా మహాభిషేక పూజ, పార్వతి రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ యాగశాల ప్రవేశం, మూలమంత్ర హవనం రాత్రి ప్రదోశ కాల పూజ, గ్రామసేవ కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు.

రాజన్న సేవలు ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌లకు ఆలయ సంప్రదాయం ప్రకారంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాజన్న సేవలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో వినోద్ రెడ్డి శేషవస్త్రం కప్పి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు, సీఐ వీరప్రసాద్, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సయ్య, నరేందర్ ఉన్నారు. అలాగే శృంగేరి విరూపాక్షమఠం పీఠాధిపతి విద్యా నృసింహ భారతిస్వామి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవోపేతంగా రాములోరి కల్యాణం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్స వాన్ని వైభవోపేతంగా నిర్వహించాలని ఈవో వినోద్‌రెడ్డి ఉద్యోగులను ఆదేశించారు. ఆలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సీతా రామచంద్ర స్వామివారి కల్యాణానికి భారీగా భక్తులు తరలివస్తారని, ఎలాంటి అసౌకర్యా లు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణానికి వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా, క్యూలైన్ ఏర్పాట్లు, పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగు దొడ్లు, కల్యాణ వేదికలాంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటలకు కల్యాణతంతు ప్రారంభమవుతుందని, అనంతరం పూర్ణహతి, సాయంత్రం రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఈ, డీఈ, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి..

రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కళ్యాణం ఏర్పాట్లును ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసు సిబ్బంది ఏర్పాటుచేయాలని సీఐ వీరప్రసాద్‌కు సూచించారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులను దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు సహాయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వెంట సీఐ వీరప్రసాద్, ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణరావు, ఏఈవో అశోక్‌కుమార్ ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలి

చందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ అన్నారు. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ సత్యేంద్రనాథ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆధ్వర్యంలో ఎన్సీడీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం తనిఖీ చేసి, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సరు, ఓరల్ క్యాన్సరు, గర్భాశయ క్యాన్సర్లు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల పై అవగాహన కల్పిస్తూ, 100శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, సీహెచ్‌వోలు సత్యనారాయణ, బాలచంద్రం, చందుర్తి వైద్యాధికారి డాక్టర్ వేదాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలపై సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్పీ అశోక్‌కుమార్

మల్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ఈనెల 11 నుంచి 13 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ అశోక్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, వివిధ శాఖల అధికారులతో కొండగట్టు దేవస్థానం కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సమన్వయంతో పని చేయాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ భక్తులు వచ్చేదారుల్లో విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పార్కింగ్ తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేములవాడ, జగిత్యాల నుంచి కొండగట్టుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో పి.మధుసూధన్, డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

● భారీ బందోబస్తు: ఎస్పీ అశోక్‌కుమార్

హనుమాన్ చిన్న జయంతికి వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెయ్యి మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి వంద సీసీ కెమెరాలతో కొండంతా పర్యవేక్షణ చేస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు మఫ్టీ, సీసీఎస్ పోలీసులు అందుబాటులో ఉంటార న్నారు. శాంతియుతంగా ఉత్సవాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు.

మానసాదేవి ఆలయానికి భక్తుల తాకిడి

- ఆది, మంగళ, శుక్రవారాల్లో విపరీతమైన రద్దీ
- భక్తులతో కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు
- అదనపు బస్సులు నడపాలని వేడుకోలు
- స్పందించని అధికారులు



ఖాసీంపేటలో బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

గన్నేరువరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేటలో స్వయంభుగా వెలసిన మానసాదేవి, అపురూపలక్ష్మీ అమ్మ వార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. ప్రతి ఆది, మంగళ, శుక్ర వారాల్లో భక్తుల తాకిడి విపరీతంగా ఉంటోంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం చేపడుతున్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లో దర్శనం చేసుకునేందుకు ఇటీవల రేలింగ్ ను ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహణకు 15మందిని ఏర్పాటు చేసి వారికి 7500 నుంచి 15 వేల వరకు జీతాలను అందజేస్తున్నారు.

కరీంనగర్ నుంచి ఖాసింపేటకు వచ్చే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. 50 మంది ఎక్కాల్సిన బస్సుల్లో 150మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. బస్సులు సరిపడా లేక ఆలయానికి వచ్చిన భక్తులు గంటల తరబడి ఆలయం వద్ద, అటు కరీంనగర్ బస్టాండ్ వద్ద పడిగాపులుగాస్తున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలని ఆలయ కమిటీ సభ్యులు, స్వచ్ఛందసంఘాల సభ్యులు,కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించిన దాఖలాలు లేవు. మండలానికి రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడం, డ్రైవ ర్లకు సైతం గంటకుపైగా బస్సును నడపడం కత్తి మీద సాములా మారింది. ఇప్పటికైనా కరీంనగర్ ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి సరిపడా బస్సులు నడపాలని భక్తులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



భక్తులతో కిక్కిరిసిన మానసాదేవి ఆలయం

నంబర్‌ప్లేట్ టాంపరింగ్ చేసిన 60 బైక్‌ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ ఒకటో ఠాణా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్‌ప్లేట్‌లు లేకుండా, నంబర్‌ప్లేట్‌లను టాంపరింగ్ చేసినట్లు గుర్తించిన 60 ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసు ఠాణాకు తరలించి జరిమానాను విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు హై సెక్యూరిటీ నంబర్‌ప్లేట్‌ను తప్పని సరిగా అమర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్ఐ ఇషాక్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతులపై విత్తన భారం
(5వ పేజీ తరువాయి)

పెంచారు. 864 నుంచి 901 రూపాయలకు ప్యాకెట్ ధర పెరిగింది. విత్తనాల కంపెనీలు ధరలు పెంచకుండా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ కంపెనీలకు వత్తాసు పలకడం సరైంది కాదని, ధరలను నియంత్రించాలని, మద్దతు ధరలు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

యేటా ధరలు పెంచుతున్నారు
- బోడకుంట బాలరాజు, రైతు ఓదెల



యేటా విత్తన కంపెనీలు పత్తి ధరలు పెంచుతున్నాయి. పత్తి సాగు వల్ల లాభాలు లేకపోయినా వర్షాధార పంట కింద పత్తి సాగు చేస్తున్నాం. యేటా అన్ని రకాల ధరలు పెంచుతున్నారు కానీ, రైతులకు గిట్టుబాటు ధరలు పెంచడం లేదు. పెంచిన మద్దతు ధరలు కూడా దక్కడం లేదు. పెంచిన విత్తనాల ధరలను వెంటనే తగ్గించాలి.

క్వింటాలుకు రూ.10 వేలు చెల్లించాలి
- కుమార్, రైతు కాల్వశ్రీరాంపూర్



విత్తనాల ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. క్వింటాలు పత్తికి రూ.10 వేలు చెల్లించాలి. మూడు ఎకరాల్లో పత్తి సాగు చేస్తా. సాగు గిట్టుబాటు కావడం లేదు. 10 విత్తన ప్యాకెట్లు అవసరం ఉంటాయి. ఒక్కో ప్యాకెట్‌పై పెంచి 37తో నాపై 370 రూపాయలు అదనంగా భారం పడుతున్నది. విత్తన ధరలను తగ్గించాలి.

ఎంసీహెచ్‌లో కవలల జననం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన అరికిళ్ల మేఘన మొదటి కాన్పు కోసం బుధవారం ఎంసీహెచ్‌లో చేరింది. గురువారం సాయంత్రం నుంచి మేఘనకు నొప్పులు రావడంతో అప్రమత్తమైన వైద్య బృందం డెలివరీ కోసం ఏర్పాట్లు చేశారు. కవలలు ఉండటంతో రక్తస్రావం జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలతో ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. మేఘన మగ, ఆడ శిశువులకు జన్మనిచ్చింది. చిన్నారులకు పిల్లల డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రిటికల్ కేర్ సేవలు అందించిన వైద్యులు డా. ప్రియాంక, డా. కృష్ణవేణి, డా.సంధ్యలను కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీ హెచ్‌ఎస్ కొండ శ్రీధర్‌లు ఒక ప్రకటనలో అభినందించారు.

బాబుజగ్జీవన్‌రామ్ జయంతికి తరలిరండి

ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఉదయం 11 గంటలకు బాబుజగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు వివిధ కులసంఘాల నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బాపయ్య, న్యాతరి పోచయ్య, సంపత్, శ్రీనివాస్, ఇరుగురాల సదయ్య, ఆసంపల్లి శంకర్, పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం



పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నామని, తెల్లరేషన్ కార్డుదారులందరికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం పాలితం, కాసులపల్లి, అప్పన్నపేట, అందుగులపల్లి, రాఘవపూర్, రంగాపూర్, గౌరెడ్డిపేట, గుర్రాంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. వానాకాలం నుండి సన్న వడ్లకు రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించి ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 55 రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా జరుగుతుందని, అవసరమైతే అదనపు షాపులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని గుర్తు చేశారు. అర్హులైన పేదలందరికీ రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ చర్మన్ కూర మల్లా రెడ్డి, సింగిల్ విండో చెర్మన్ సంపత్, రాజేందర్, అరె సంతోష్, ఏడెల్లి శంకర్, రాజయ్య, మందల సత్యనారాయణ రెడ్డి, వెంకటేష్, కొమ్ము శ్రీనివాస్, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ప్రజల కోసం సన్న బియ్యం పంపిణీ చేపట్టామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కటికెనపల్లి, మేడారం గ్రామాలలో కలెక్టర్ శ్రీహర్షతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులందరి కోసం సన్న వడ్లకు బోనస్ చెల్లించామని, ఒక్క ధర్మారం మండలంలోనే 7.5 కోట్ల రూపాయల బోనస్ రైతుల ఖాతాల్లో జమచేశామని తెలిపారు. మేడారంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, మేడారం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. డీలర్ల గౌరవ వేతనం పెంపుతో పాటు తరగు సంబంధించిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, బ్లాక్-2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, నాయకులు కాడే సూర్య నారాయణ, దేవి జనార్ధన్, కొత్త నర్సింహులు, కొడారి హన్మయ్య, తహసీల్దార్ ఎండీ వకీల్, ఆర్‌ఐ వరలక్ష్మి, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు దొనికెని తిరుపతి పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, బియ్యాన్ని ఉచితంగా అందించడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి అర్హుడికి పథకం ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి జరిపి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కడుపు నింపేందుకు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. గోలివాడ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాలా తీసిందని పేర్కొన్నారు. మండలానికి చెందిన 31మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు రాజలింగం, గడ్డం తిరుపతి, పూదరి సత్తయ్యగౌడ్, మడ్డి తిరుపతి గౌడ్, హనుమాన్ రెడ్డి, గోపాల్‌యాదవ్, పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): కనగర్తి, గుండ్లపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పేదలకు కడుపునిండా తిండి దొరకాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. చొప్పరి రాజయ్య, ఉడిగే సదయ్య, కసిరెడ్డి మహేందర్‌రెడ్డి, రమణరెడ్డి పాల్గొన్నారు.

రేషన్‌షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సన్న బియ్యం సరఫరా పై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు దొడ్డు బియ్యం తినడం లేదని, దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం 84శాతం జనాభాకు ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా రవాణా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా సీఎం భద్రాచలంలో సన్న బియ్యం స్వీకరించిన దళిత గిరిజన కుటుంబాలతో కలిసి భోజనం చేస్తారని, జిల్లా స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కలెక్టర్లు, పేదలతో కలిసి భోజనం చేయాలని మంత్రి సూచించారు. సీఎస్ మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ కారణంగా రేషన్ షాపుల వద్ద డిమాండ్ పెరిగి పోతున్నందున బియ్యం రవాణా వేగవంతం చేయాలన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, అధికారులు, పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ శ్రీహర్ష, పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటు తప్పదని, ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం కోల్పోయారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లాపురం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శారదానగర్‌లోని శిశుమందిర్‌లో జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి పాలన పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అసంతృప్తితో ఉన్నారని, ఎప్పుడు రేవంత్‌రెడ్డిని గద్దె దించేది తెలియదన్నారు. ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో ప్రగతి పథంలో ముందుకు దూసుకెళుతుందన్నారు. కార్యకర్తలు గ్రామం లేదా బస్తీల్లో కనీసం 8గంటలు సందర్శించి ఆసుపత్రులు, పాఠశాలలు, దేవాలయాలు ఉన్నాయా లేదా అని తెలుసుకోవాలన్నారు. ఈనెల 6 నుంచి బీజేపీ ఆవిర్భావ వేడుకలను పండుగలా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి, రఘునాథరావు, కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, చల్లా నారాయణరెడ్డి, వెంకన్న, కోమళ్ల మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా

కోల్‌సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ కే మాధవరావు చెప్పారు. శుక్రవారం గౌతమినగర్ సబ్ స్టేషన్ 33కేవీ ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కోసం కొత్తగా నిర్మించిన నాలుగు కిలోమీటర్ల లైన్ ఫీడర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల వల్ల విద్యుత్ అంతరాయం నివారించడానికి రెండు ఫీడర్లకు 33కేవీ డీపీ స్ట్రక్చర్‌ను చార్జి చేశామన్నారు. డీఈ, ఏడీఈ పాల్గొన్నారు.

ఎంపీవోగా ఆరీఫ్

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ అధికారి ఆరీఫ్ ఎలిగేడు మండలం నుంచి శుక్రవారం కాల్వశ్రీరాంపూర్ బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎంపీఓ కిరణ్ ఎలిగేడు వెళ్లారు.

కిరాయిలు పెంచవద్దంటూ నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కిరాయిదారులు

కోల్‌సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కిరాయిలు పెంచవద్దంటూ గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన వ్యాపారులు శుక్రవారం నిరసనకు దిగారు. సింగరేణి క్వార్టర్ల ముందున్న షెడ్లను కిరాయికి ఇచ్చిన వారు క్వార్టర్లకు తొలగించినా తమను కిరాయిలకు వేధిస్తున్నారని నిరసన తెలిపారు. ఒక క్వార్టర్ యజమాని శుక్రవారం కిరాయి పెంచాలని రెండు షాపులకు తాళాలు వేయడంతో వివాదం మొదలైంది. దీంతో వ్యాపారులు ఒక్కటై షాపులు మూసి వేసి ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఇప్పటికే లక్షల రూపాయలు అడ్వాన్స్‌లు యజమానుల వద్ద ఉన్నాయని, అయినా కిరాయిలు పెంచాలంటూ వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే క్వార్టర్లు కూల్చివేశారని, రేపోమాపో షాపులు కూల్చివేస్తారని, అడ్వాన్స్ డబ్బులు ఇచ్చిన తరువాతనే కిరాయిలు చెల్లిస్తామని పేర్కొన్నారు. యజమానులు అడ్వాన్స్‌పై ఎలాంటి హామీ ఇవ్వకుండానే కిరాయిలు చెల్లించాలని, పెంచాలని డిమాండ్ చేస్తుండడంతో వివాదంగా మారింది.

గంగానగర్ మిలీనియం బ్లాక్‌లో జీఎం పాదయాత్ర



కార్మిక కుటుంబాలతో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గంగానగర్ మిలీనియం బ్లాక్‌లో ఉద్యోగుల వసతులు, సంక్షేమంలో భాగంగా ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఉద్యోగుల క్వార్టర్లలో అందుతున్న సదుపాయాలను, క్వార్టర్‌లలో సానిటేషన్, తాగునీటి సరఫరా, సివిల్ వర్క్స్, ఎలక్ట్రికల్ సంబంధించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జీఎం సూచించారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ కే స్వామి, డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్ రావు, డీజీఎం (వర్క్‌షాప్) జితేందర్‌సింగ్, ఎస్‌ఈ సివిల్ వరప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఫారెస్ట్ అధికారి కర్ణ, సీనియర్ పీఓ హనుమంతరావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, అధికారులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి



అల్ఫోర్స్‌లో అలరించిన విద్యార్థినుల నృత్యాలు



కమాన్‌పూర్, మంథనిలో గ్రాడ్యుయేషన్ వేడుక

సుల్తానాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధించేందుకు ఇష్టంతో చదవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం జోష్ కార్యక్రమం నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే మార్పులను గమనిస్తూ ముందుకు పోవాలన్నారు. పలువురు విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో..

సుల్తానాబాద్(ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్ అన్నారు. ఐపీఎస్ స్కూల్ వార్షికోత్సవ సంబరాలు స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించారు. తేజస్ పేరుతో నిర్వహించిన సంబరాలను స్కూల్ కరస్పాండెంట్ కృష్ణప్రియ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారుల ఆటా పాటలు అలరించాయి.

పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ డేలు

మంథని, (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి హైస్కూల్‌లో పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్‌జాఫర్, హెచ్‌ఎం సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ మంథనిలో 15 సంవత్సరాలుగా విద్యను అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంఫర్ట్ గ్రామర్ పాఠశాలలో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ సౌమ్య, వ్యవస్థాపకులు వినయ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల చిన్నారుల్లో స్ఫూర్తి, పట్టుదల పెరుగుతుం దన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): విశ్వభారతి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎల్‌కేజీ పూర్తి చేసుకొని ప్రైమరీ స్కూల్‌కు వెళ్తున్న 115 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ చిన్నారులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్‌ఎం తిరుపతి గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు కాంతారావు మృతి



ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, జిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘం అధ్యక్షుడు తానిపర్తి కాంతారావు(99)శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశం, కోశాధికారి వెలగందుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్ రావులు వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ భూమిలో దర్గా నిర్మాణంపై ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విష్ణుపురి కాలనీ ప్రభుత్వ భూమిలో అక్రమంగా దర్గా నిర్మాణం జరిగిందని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్ శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. విలేకరులతో మాట్లాడుతూ విష్ణుపురి కాలనీలో సర్వే నంబర్ 891లో ఎకరం 21 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, దాని విలువ సుమారు 15 కోట్ల రూపాయల వరకు ఉంటుందన్నారు. ఈ భూమిలో రాత్రికి రాత్రే దర్గా నిర్మించారని, ఇది చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. అధికారులు నిర్మాణాన్ని తొలగించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరాడు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేట్ ఎదుట ఓ వ్యక్తి సింగరేణి స్థలాన్ని కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఓ వ్యక్తి వెల్డింగ్ షాపు కోసం చిన్నషెడ్డును వేసి ఏకంగా బిల్డింగ్ నిర్మించాడు. ఇప్పుడు చిన్న పందిరి వేసి మరో షాపును తయారు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కబ్జా చేసినా పట్టించుకోకపోవడం చర్చకు దారితీసింది.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ విజయవంతం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో మూడురోజుల పాటు జరిగిన రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేసిన సబ్బండవర్గాలకు, గౌడ కులబాంధవులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మేరుగు హన్మంత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడురోజుల పాటు అన్నదానం చేసిన బాలసాని కొమురయ్యగౌడ్‌ను సన్మానించారు. శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, కొమురయ్యగౌడ్, పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతోనే ప్రత్యేక గుర్తింపు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అందమైన చేతిరాతతోనే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని అంతర్జాతీయ చేతిరాత నిపుణుడు డిడ్డి సతీష్ అన్నారు. శుక్రవారం ఊషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వారానికో వక్త అనే అంశంపై మాట్లాడారు. సతీష్ పాఠశాల పిల్లలకు చేతిరాతలో మెళకువలు నేర్పించారు. ఆంగ్లభాషాక్షరాలు, పదాలను రాయించారు. ఉత్తమంగా రాసిన ఐదుగురు విద్యార్థులను హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయులు అమృత, పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం



ఎలిగేడులో సహకార సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

ఎలిగేడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను బలోపేతం దిశగా అధికారులు పాలకవర్గాలు సమిష్టి కృషితో పనిచేయాలని డీసీవో శ్రీమాల అన్నారు. శుక్రవారం పీఏసీఎస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. సహకార బ్యాంకులు అంటే భయపడేవారని, నేడు రైతులు నిర్భయంగా రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, తిరుపతిగౌడ్, వెంకన్న, కనుకయ్య, సీఈవో విక్రమ్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీం, జై సంవిధాన్ పై ప్రచారం

ముత్తారం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి, జిల్లాలపల్లె, రామకృష్ణాపూర్ గ్రామాలలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, గోవింద్ పద్మ ఆనంద్, శ్రీనివాస్, కుమార్ స్వామి, శివకుమార్, వినీత్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణి అన్నారు. శుక్రవారం పెద్దకల్వలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలుష్యం, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మహిళలకు అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. చిన్న సమస్య ఏర్పడగానే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యదర్శి నిషాంత్‌రావు, పల్లె దవాఖాన వైద్యులు రాజేష్‌కుమార్ గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాఘవపూర్‌లో బసంత్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, డయల్ 100, 1930పై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మహిళలను వేధిస్తే కఠినచర్యలు ఉంటాయని, వారి కోసం ప్రత్యేకంగా షీటీంలు పని చేస్తున్నాయన్నారు. మొబైల్ ఫోన్‌లకు అనవసరమైనా లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, గొడవలు నిర్మూలించాలంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి, పంచాయతీ కార్యదర్శి తూముల రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో సరైన సౌకర్యాలు కల్పించాలి

జ్యోతినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీలో సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం డిస్పెన్సరీని సందర్శించారు. ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణకు అవసరమైన కిట్లు, మందులు ఫార్మసీలో అందుబాటులో లేవన్నారు. కార్మికులు,వారి కుటుంబ సభ్యులకు షుగర్, బీపీ సంబంధ వ్యాధులకు ఇచ్చే మందులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రామాచారి, రాఘవరెడ్డి, రవిందర్, దేవేందర్, లక్ష్మణమూర్తి, తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రాంబించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాకర్ అసోసియేషన్ సామాజిక కార్యక్రమాలు చేస్తూ మరింత ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్ నేషనల్ డిప్యూటీ గవర్నర్ వెంకట్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టె లక్ష్మయ్య మాట్లాడుతూ యేటా బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు, సభ్యుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ హాస్టల్లో పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోదండ రామాలయం ఉత్సవ కమిటీ నియామకం



నియామకమైన ఉత్సవ కమిటీ సభ్యులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోదండ రామాలయం ఉత్సవ కమిటీ శుక్రవారం నియామకమైంది. కమిటీ చైర్మన్‌గా గట్ల రమేష్, సభ్యులుగా వొజ్జల వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణప్రియ, ఎన్.సత్తయ్య, ఇ.వనజారాణి, ఎం.ప్రవీణ్, ఎ.దశరథంలు నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ నియామక పత్రాలను అందజేశారు. విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ ఈ ఏడాది సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఓదెల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రాచర్ల శంకర్ ఇటీవల మృతి చెందగా శుక్రవారం అతడి స్నేహితులు కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న శంకర్ ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. 2001-02లో పదో తరగతి స్నేహితులు సేకరించిన రూ.43 వేలను మృతుడి భార్య, కుమారులకు అందజేశారు. సతీష్, స్వామి, మహేందర్, కుమార్, రవీందర్, రాజేష్, సాయి, శ్రీనివాస్, రవికుమార్, తిరుపతి పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన అరిసెనపల్లి శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా అతని చిన్ననాటి మిత్రుడు సుంకు రాంచందర్ శుక్రవారం బాధిత కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సుందరం ఫౌండేషన్‌ఫౌండర్ బోనాల వెంకటస్వామి, సుంకు వెంకటేశ్వర్లు, రమేష్, సదాశివ్, రాజశేఖర్, జగన్, శ్రీనివాస్, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత

కమాన్‌పూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీజీ గురుకుల సెట్‌లో ప్రాథమిక పాఠశాల రాజాపూర్ నుంచి 8మంది విద్యార్థులు పరీక్ష రాయగా శుక్రవారం వెలువడిన ఫలితాల్లో వంద శాతం అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరుగు రాజమౌళి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు. ఏఏపీసీ చైర్మన్ లలిత, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, ఉపాధ్యాయులు మమత, సమత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

ధర్మారం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం హన్మాన్ మాల ధరించిన స్వాములు పాల పొరక తీసుకువచ్చి పందిరిని అలంకరించారు. శనివారం విశ్వక్సేన ఆరాధన, ఎదుర్కొళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు.